
4లో.

హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ స్టేడియం తీసుకొస్తాం


# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...








సంపుటి - 1 సంచిక - 207 శనివారం 3 ఆగష్టు 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# టీచర్ల చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్తు




- తెలంగాణ సాధనలో వారి పాత్ర కీలకం
- 25వేలమందికి పదోన్నతులు కల్పించాం
- ఒకటో తేదీన జీతాలు పడేలా చేస్తున్నాం
- పేదల చదువుతోనే తెలంగాణకు భాగ్యం
- సర్కారీ బడికి వెళ్లడం ఆత్మగౌరవంగా భావించాలి
- పాఠశాలలకు ఉచిత విద్యుత్..మౌళిక వసతుల కల్పన
- ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో భేటీలో సిఎం రేవంత్

2లో.

# జాబ్ క్యాలెండర్

## విడుదల చేసిన ప్రభుత్వం

- నోటిఫికేషన్లు..పరీక్షలు.. తేదీల వివరాలు ప్రకటన
- అసెంబ్లీలో ప్రకటించిన డిప్యూటి సిఎం భట్టి
- గతంలో అస్తవ్యస్త విధానాలతో నిరుద్యోగులకు నిరాశ
- ఇచ్చిన హామీ మేరకు ముందుకు వెళుతున్నామని వెల్లడి

హైదరాబాద్,ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రకటించారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు.

మిగతా 2లో.



# జాబ్ క్యాలెండర్ కాదు..

# ఫేక్ క్యాలెండర్

దమ్ముంటే అశోక్ నగర్ వచ్చి.. నువ్విచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పు..

రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాలు..

హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిరసన..

నిరసనలో పాల్గొన్న ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి..

హైదరాబాద్,ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): మార్పు మార్పు అంటూ తెలంగాణ ప్రజలను ఎక్కువ రోజులు ఏమార్చలేరని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తప్పకుండా ప్రజలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు.జాబ్ క్యాలెండర్‌లో ఉద్యోగాల సంఖ్య ప్రకటించకుండా నిరుద్యోగులను మోసం చేశారని హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన నిరసనలు తెలిపారు

మిగతా 2లో.



# నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ లోపాల వల్లనే నీట్ లీకేజీ

పరీక్ష రద్దు అవసరం లేదని గతంలోనే తీర్పు ఇచ్చిన సుప్రీం కోర్టు

తక్షణమే లోపాలను సరిదిద్దుకోవాలన్న ధర్మాసనం

హైదరాబాద్,(జర్నలిస్ట్ వార్త): నీట్ యూజీ పరీక్షల లీకేజీపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం నేడు (శుక్రవారం) కీలక వ్యాఖ్యలు చేసింది. పేపర్ లీక్ కావడంతో పరీక్ష రద్దు చేయాల్సిన అవసరం లేదని గత నెలలోనే తీర్పు ఇచ్చిన సర్వోన్నత న్యాయస్థానం .



మిగతా 2లో.

# తెలుగు వర్సిటీకి సురవరం పేరు



హైదరాబాద్,ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలోని అన్ని పార్టీలకు అతీతంగా అంగీకరిస్తే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి తెలంగాణ వైతాళికుడు, ఉద్యమకారుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడతామని, అందులో తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.కేటీఆర్ మాట్లాడుతూ.. సురవరం ప్రతాప్‌రెడ్డిపై తమ పార్టీ పెద్ద కేసీఆర్‌కు ఎనలేని గౌరవం ఉన్నదని, అందుకే తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరు పెట్టాలని నిర్ణయించారని గుర్తుచేశారు. పదేండ్లపాటు యూనివర్సిటీ విభజన జరగలేదని, అందుకే పేరు పెట్టలేకపోయామని వివరించారు.

మిగతా 2లో.

# ఇళ్లలోకి చొరబడి మనుషులను చంపడమా!

## మహిళను వీధి కుక్కలు తినడంపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు

పరిష్కార మార్గం కనుగొనకుంటే ఎలా

అని సర్కార్‌ను నిలదీత


స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కాదు..


నియంత్రణకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలి

జీహెచ్ఎంసీకి పలు మార్గదర్శకాలు

జారీ చేస్తూ ఉత్తర్వులు

4లో.







# టీచర్ల చేతుల్లోనే తెలంగాణ భవిష్యత్తు

హైదరాబాద్,ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని ఉద్ఘాటించారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఉపాధ్యాయులే తమ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 25వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాం. 30 వేల మందిని బదిలీ చేశాం. ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు మీ ఖాతాలో పడేలా చూసే బాధ్యత మాది. ఈ సమ్మేళనంలో రాజకీయం, స్వప్రయోజనం లేదు. తెలంగాణ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవం అని తల్లిదండ్రులు భావించాలి. అందుకు అందరం కలిసి కృషి చేయాలి. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తాం. పాఠశాలలకు ఉచిత విద్యుత్ ఇస్తాం.. ఆ బిల్లు ప్రభుత్వమే చెల్లిస్తుంది. పేద పిల్లలు, దళిత వర్గాల పిల్లలు చదువుకుని బాగు పడితేనే రాష్ట్రం బలపడుతుంది. దిల్లీలో మూడుసార్లు కేజ్రీవాల్ గెలిచింది బస్తీల్లో పాఠశాలలు మెరుగుపరచడం వల్లే. మళ్లీ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉండాలంటే మీరు పేదలకు చదువు చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని తాను ఈ స్థాయికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థులు ఉన్నారని... తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని వివరించారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందని అనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయు లను ఏ విధంగా అవమానించారో చూశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు..10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు..మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నేను ఈ స్థాయికి చేరా. అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమావేశం. టీచర్లంతా 90శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలి.. విద్యార్థులకు విద్యనందించాలి. గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించాం అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించాం. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలని అన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది. అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)
ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ..గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్దం పాటు అధికారంలో ఉన్నా, నిరుద్యోగులకు న్యాయం జరగలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు న్యాయం చేయడంలో భాగంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండు సార్లు గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దు అయిందని, ఉద్యోగాల భర్తీ పక్రియ గందరగోళంగా మార్చారని ఆరోపించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ లతో రెండు కమిటీలు ఏర్పాటు చేసి, వారి సూచనల్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పాత గ్రూప్ 1 నోటిఫికేషన్ రద్దు చేసి, 60 కొత్త పోస్టులతో మొత్తం 563 పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రూప్ 1 నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రూప్ 1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు 3 లక్షల మంది హాజరుకాగా, పరీక్ష సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటించామన్నారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఒక లక్షా 45 వేల 368 మంది హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలకు, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ ఎగ్జామ్ కు 1 లక్షా 6 వేల 2 వందల 60 మంది హాజరుకాగా, విజయవంతగా నిర్వహించాం. 32 వేల 4 వందల 10 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీ చేశాం. అదనంగా 13,500 ఉద్యోగ ఖాళీల భర్తీకి అనుమతులు ఇచ్చాం. 11 వేల 62 ఖాళీలతో టీచర్ రిక్రూట్ మెంట్ కోసం డీఎస్సీ ఎగ్జామ్ ప్రకటించాం. జులై 18న ప్రారంభమై ఆగస్టు 5న ముగియనున్నాయి. 465 సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఖాళీల భర్తీకి, ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ లో 45 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాం. పరీక్షల ప్రిపరేషన్ కు తగినంత సమయం లేదని అభ్యర్థులు కోరడంతో ఆగస్టు నుంచి డిసెంబర్ కు గ్రూప్ 2 ఎగ్జామ్ వాయిదా వేశాం. పరీక్షా తేదీలు ఒకటే కాకుండా, పరీక్షల మధ్య ప్రిపరేషన్ కు సమయం ఉండేలా అన్ని నియామక బోర్డులు ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాయని భట్టి విక్రమార్క ప్రకటించారు. గత ప్రభుత్వం నిర్వహించిన నియామక పరీక్షల పేపర్లు లీకయ్యాయి, పేపర్ల అమ్మకంతో పరీక్షలు రద్దయ్యాయి. పేపర్ లీక్ కారణంగా 2023 మార్చి 17న తొలిసారి గ్రూప్ 1 ఎగ్జామ్ రద్దయింది. అభ్యర్థుల బయో మెట్రిక్ తీసుకోని కారణంగా హైకోర్టులో రెండోసారి ఎగ్జామ్ రద్దు అయింది. ప్రస్తుతం ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిరుద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నాం. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను ప్రక్షాళన చేసి, కొత్త చైర్మన్ ను నియమించి వరుసగా పోస్టుల భర్తీని పూర్తి చేశాం. పాత నోటిఫికేషన్లను రద్దు చేసి కొత్త నోటిఫికేషన్లు విడుదల చేసి, ఎగ్జామ్స్ సజావుగా నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తున్నామని' భట్టి విక్రమార్క పేర్కొన్నారు.ఇకపోతే షెడ్యూల్ ప్రకారం..వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. ట్రాన్స్‌కోలోని వివిధ ఇంజినీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు చేపడతారు. నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు చేపడతారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు జరుగుతాయి. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు చేపడతారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జులైలో నిర్వహించ నున్నారు. ఎస్సై, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు. డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్..సెప్టెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది మేలో మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు జరుపుతారు. సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు చేపడతామని ప్రకటనలో వివరించారు.

## జాబ్ క్యాలెండర్ కాదు.. ఫేక్ క్యాలెండర్

(మొదటి పేజీ తరువాయి)




.హరీష్ రావు,మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి,గంగుల కమలాకర్,మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ,రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. దమ్ముంటే అశోక్‌నగర్‌కు వచ్చి.. నువ్వు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ కరెక్ట్ అని చెప్పమని రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు. ఈ 8 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇచ్చిందని అక్కడ ఉన్న నిరుదోగులతో చెప్పించాలన్నారు. అలా చేస్తే మేమందరం రాజీనామా చేస్తామని సవాలు విసిరారు.రెండు లక్షల ఉద్యోగాలు బోగస్ అని కేటీఆర్ అన్నారు.ఈ విషయం మీకు కూడా తెలుసని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. మీరిచ్చిన జాబ్ క్యాలెండర్ బోగస్ అని తెలుసు..అయినా కూడా పిల్లల్లో ఉద్వేగాల్ని రెచ్చగొట్టేవిధంగా లేని ఒక వాతావరణం నిర్మాణం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.మీ క్యాలెండర్ బోగస్.. అందులో ఉద్యోగాలే లేవు. అందులో తారీఖులు తప్ప ఏమీ లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు.జాబ్ క్యాలెండర్‌పై చర్చ పెట్టమంటే రాష్ట్ర ప్రభుత్వం పారిపోయిందని ఎద్దేవా చేశారు.సిగ్గులేకుండా మళ్లీ మా ఎమ్మెల్యేలను సాటి ఎమ్మెల్యేతో ఒక బజారు భాషలో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది ప్రజాస్వామ్యానికి, శాసనభకు చీకటి రోజు అని ఆయన వ్యాఖ్యానించారు.దుర్మార్గమైన పద్ధతిలో నిన్న,మొన్న మా అక్కల్ని అవమానించారని.. ఇవాళ ఒక సభ్యుడు అమ్మ, అక్క అని తిడుతుంటే శాడిస్టు మాదిరిగా ముఖ్యమంత్రి పైశాచిక ఆనందం పొందుతూ అందర్నీ ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఒక శాడిస్టు ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దీనికి తప్పకుండా తెలంగాణ యువత తప్పకుండా రేవంత్ రెడ్డికి తగు రీతిలో సమాధానం చెబుతుందని హెచ్చరించారు.ఎక్కువ రోజులు డ్రామా నడవదని స్పష్టం చేశారు.ఈ ఐదారు రోజుల శాసన సభ సమావేశాల్లో ప్రభుత్వం తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. గవర్నమెంట్‌లో విషయం లేదు.. కేవలం ఊదరగొట్టే ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఏమీ లేవని తేలిపోయిందని కాబట్టే ఈ బజారు భాషతో మమ్మల్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు.మంచిగా మాట్లాడుతుంటే కావాలనే ఉసిగొల్పి ప్రజల దృష్టి మరల్చే ఒక చీప్ టాక్టిక్స్‌కు చేస్తున్నారని మండిపడ్డారు.ఈయన చీఫ్ మినిస్టర్ కాదు.. చీప్ మినిస్టర్ అని ఎద్దేవా చేశారు.ఒక శాడిస్టు ముఖ్యమంత్రిగా పైశాచిక ఆనందం పొందుతూ.. ఆడబిడ్డలను అవమానిస్తూ.. ఎమ్మెల్యేలను బూతులు తిట్టిస్తూ, ఇష్టమొచ్చినట్టు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని అన్నారు.అందుకే అసెంబ్లీలో నిరసన చెప్పి బయల్దేరి గన్‌పార్క్ వద్దకు వచ్చి.. మా శాసన సభ్యులు, మండలి సభ్యులు అందరం వచ్చి మా నిరసన చెబుతున్నామని పేర్కొన్నారు.హైదరాబాద్ మీద కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతుందని కేటీఆర్ మండిపడ్డారు.ఆ విషయంలో కూడా తప్పకుండా ప్రభుత్వాన్ని తూర్పార పడుదామని అనుకున్నామని చెప్పారు.కానీ బజారు భాషలో మాట్లాడేసరికి మా అక్క కోవ లక్ష్మీ దుఃఖం ఆపుకోలేక.. తమను బయటకు తీసుకొచ్చారని తెలిపారు.ఈ శాసనసభలో తెలంగాణ ప్రజలకు న్యాయం చేసే ముచ్చట్లు లేవని.. కేవలం కాంగ్రెస్ పార్టీ డ్రామాలు,కాంగ్రెస్ పార్టీ నాటకాలు తప్ప ఏమీ లేవని మండిపడ్డారు. అప్పులు,అప్పులు అని ఇన్ని రోజులు తప్పుడు కూతలు కూశారని చెప్పారు. అప్పులు లేవు..ఈ రాష్ట్రం రెవెన్యూ సర్‌ప్లస్ స్టేట్ అని మేం ఎస్టాబ్లిష్ చేస్తే ఇవాళ నోరు మూసుకున్నారని తెలిపారు.అనేక విషయాలను డైవర్ట్ చేయడానికే మా అక్కల మీద నోరుపారేసుకుని.. కావాలని ప్రజల దృష్టి మరల్చే ఓ చిల్లర ప్రయత్నం చేస్తున్నాడు.. ఈ చిల్లర ముఖ్యమంత్రి అని మండిపడ్డారు.కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని గ్రహించాలని తెలంగాణ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## తెలుగు వర్సిటీకి సురవరం పేరు

(మొదటి పేజీ తరువాయి)పదేండ్లు గడిచి, విభజన జరిగినందున యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టాలని సూచించారు. తెలంగాణ సంక్షిప్త పదాల మార్పు బిల్లును స్వాగతిస్తూనే ప్రభుత్వానికి బీజేపీ, ఎంఐఎం చురకలు అంటించాయి. ప్రభుత్వం పేర్లు మార్చటంపైనే కాకుండా ప్రజలకు పనికివచ్చే అంశాలపై ఎక్కువగా దృష్టిసారించాలని సూచించాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లను మార్చిందని, ఆసరా పింఛన్లకు చేయూత, దళితబంధుకు అంబేద్కర్ అభయహస్తం అని పెట్టిందని ఉదహరించారు.తాము కోరిన సమాచారాన్ని వెంటనే అందించి సహకరించేలా ఆయా ప్రభుత్వ విభాగాలకు ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు కమిషన్ కసరత్తు చేస్తున్నది. ఉదయం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

## నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ లోపాల వల్లనే నీట్ లీకేజీ

(మొదటి పేజీ తరువాయి)వాటి కారణాలు వెల్లడిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ లోపాల వల్లనే లీకేజీ జరిగిందని కోర్టు అభిప్రాయపడింది. పేపర్ లీకేజీలో ఎలాంటి వ్యవస్థీకృత ఉల్లంఘనలు జరగలేదని, పరీక్ష పవిత్రతను దెబ్బతీసే స్థాయిలో జరగలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఝార?ండ్ లోని హజారీబాగ్, బీహార్ పాట్నా కేంద్రాల్లో మాత్రమే పేపర్ లీకేజీ జరిగిందని, దీనిపై సీబీఐ దర్యాప్తు కూడా జరుగుతున్నందున పరీక్ష రద్దు చేయాలని అనుకోవడం లేదని తెలిపింది. నేషనల్ టెస్టింగ్ ఏజన్సీలో కొన్ని లోపాలు ఉన్నాయనీ, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలని చెప్పింది. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలని స్పష్టం చేసింది. ఇదే క్రమంలో పరీక్షల సంస్కరణల కోసం ఇస్రో మాజీ చీఫ్ కే రాధా కృష్ణన్ నేతృత్వంలో నియమించిన కమిటీకి ధర్మాసనం కీలక ఆదేశాలు ఇచ్చింది. ప్యానెల్ ను మరింత విస్తరించాలని సూచిస్తూ .. పరీక్ష విధానంలో లోపాలను చక్కదిద్దేందుకు అవసరమైన చర్యలపై సెప్టెంబర్ 30వ తేదీ లోగా నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది. నివేదికను కమిటీ అందజేసిన అనంతరం వాటిలో అమలు చేసే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, విద్యాశాఖ రెండు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించింది.

# ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

## - మాల మహానాడు మండల అధ్యక్షులు సింహాద్రి




రాయపర్తి, ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు మండల అధ్యక్షులు సింహాద్రి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నామని అన్నారు. వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, గతంలో చెప్పిన కోర్టులే మరల మోడీ ప్రభుత్వం కలిసిమెలిసి ఉన్న మాల, మాదిగల మధ్య కేంద్ర ప్రభుత్వం చిచ్చు పెట్టాలని చూస్తుందని అన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రకటించకుండా, కోర్టు ద్వారా ఈ విషయాన్ని చెప్పించడం మాలలు అంటే భయపడే మోడీ ప్రభుత్వం ఈ విధంగా దళితుల మధ్యలో ఐక్యమత్యం లేదని, బిజెపి కాంగ్రెస్ ఇతర పార్టీలు రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలు మాలలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘం అధ్యక్షులు కమటం వీరస్వామి, మాల మహానాడు జిల్లా యూత్ అధ్యక్షులు ఉబ్బని మధు, మండల యూత్ అధ్యక్షులు ఉబ్బని నవీన్, ఉబ్బని అశోక్, ఉబ్బని వెంకటేశం, బల్లెం మల్లేష్, ఉబ్బని రాజు, ఉబ్బని మారయ్య, ఉబ్బని ఉప్పలయ్య, ఉబ్బని ఎల్లయ్య, కారం ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పాలు బిడ్డకు శ్రేయస్కరం

## - సన్నూర్ గ్రామంలో ర్యాలీ ప్రదర్శన




రాయపర్తి, ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరమని డి.ఎం.హెచ్.ఓ మురళీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సన్నూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాశస్త్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎంహెచ్ఓ, ఆర్ఎంవో మాట్లాడుతూ తల్లిపాల ప్రాశస్త్యం పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అన్నారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారంతో పాటు ఆటలు, పాటలతో చదువు నేర్పించడం జరుగుతుందని తెలిపారు. తల్లిపాల ప్రాక్టీస్ ప్రతి ఒక్కరు తెలుసుకొని తీరాల్సిందింగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎమ్ఓ సుగుణాకర్ రాజు, పీడియాట్రీషియన్ శంకర్, డెంటల్ డాక్టర్ గిరి ప్రసాద్, వైద్యులు మానస, లలిత,ప్రియాంక, హెల్త్ సూపర్వైజర్ అనంతలక్ష్మి, సిడిపిఓ ఇందిరమ్మ, తొర్రూరు సూపర్వైజర్ శోభ, మొరిపిరాల సూపర్వైజర్ మాధవి లత, అంగన్వాడి టీచర్లు మంజుల జహీదా బేగం, శ్రీలత, యాకుబీ, సాహేబు, రమా, పద్మ, శోభ, మమత, పద్మ, బుజ్జమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.ఐ

# ఆరోగ్యమే మహాభాగ్యం

## - సీజనల్ వ్యాధులపై అవగాహన



చెన్నారావుపేట, ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు సీజనల్ వ్యాధుల పట్ల శుక్రవారం చెన్నారావుపేట, పాపయ్యపేట, అమీనాబాద్, గ్రామాలలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దయాకర్, హెచ్ ఆర్, ఏపిఎం ధర్మేంద్ర, ప్రాజెక్టు మేనేజర్ ముక్కెర ఈశ్వర్ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. ఎవరైనా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వారి చేతుల్లోనే ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సగం రోగాలు దూరం అవుతాయని చెప్పారు. ఆరోగ్యశాఖ వారు, పత్రికలు, మీడియా ద్వారా వచ్చే సందేశాలను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం కారణంగా దోమలు, ఈగల ద్వారా వచ్చే రకరకాల జబ్బుల నుండి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, వేడివేడి ఆహార పదార్థాలు తినడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలిపారు. డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా ఉండాలంటే ఇళ్లలో నీరు పేరుకుపోకుండా, చూసుకోవాలన్నారు. రెండు మూడు రోజులు నిల్వ ఉన్న నీటిలో డెంగ్యూ దోమలు ఉత్పత్తి కావడానికి అవకాశం ఉన్నదని అన్నారు. దోమలను నివారించడం, వివిధ జబ్బుల పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా, ప్రాథమిక స్థాయిలో ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని తెలిపారు. గ్రామస్థాయిలో ఆశాలు, ఏఎన్ఎంల సేవలు అందరికి అందుబాటులో ఉన్నవని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సంఘాల నాయకులు, మహిళలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ

# అడ్డంగా దొరికిపోయిన ఎస్సై






**- అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు**

**- నేడు ఏసీబీ కోర్టులో ప్రొడ్యూస్ చేయనున్న అధికారులు**

**- ప్రభుత్వ ఉద్యోగులు డబ్బులు ఆశిస్తే చామచారం ఇవ్వాలని విజ్ఞప్తి**

పర్వతగిరి, ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పర్వతగిరి మండల ఎస్సై గుగులోతు వెంకన్న లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. ఈ సందర్భంగా వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం జులై 27వ, తేదీ శనివారం పర్వతగిరి ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో పెట్రోలింగ్ చేస్తుండగా అన్నారం క్రాస్ రోడ్డు వద్ద బెల్లం లోడుతో ఒక టాటా వాహనం వారికి పట్టుబడింది. పట్టుబడిన ఆ వాహనాన్ని పోలీస్ స్టేషన్ తరలించి, రిటర్న్ చేశారని తెలిపారు. అనంతరం టాటా వాహనం ఓనర్ భాస్కర్, డ్రైవర్ రాజేష్, వర్కర్ రవి లపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకున్న వారిని జ్యుడీషియల్ కి తరలించకుంచకుండ, ఇంతకుముందు 41 నోటీస్ ఇచ్చేవారు, అది కాకుండా ప్రస్తుతం 35 క్లాస్ బిఎన్ఎస్ఎస్ కింద నోటీసులు ఇవ్వాల్సి ఉండేది అన్నారు. ఇదేది కాకుండా వారిని పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుకున్నారు. అసలు విషయం ఏమిటని అతని మిత్రుడు వెంకట్ అజ్మీర వెంకట్ ద్వారా 70 వేల రూపాయలు ఇస్తే స్టేషన్ బెయిల్ ఇస్తామని, లేదంటే జైలుకు పంపిస్తామని ఎస్సై వెంకన్న చెప్పినట్లు వివరించారు. హఠాత్తుగా డబ్బులు లేవని చెప్పడంతో ఇప్పుడు ఇస్తేనే వచ్చిన వ్యక్తిని పోలీస్ స్టేషన్ పంపిస్తాను, లేదంటే పంపను అంటూ డబ్బాయించడంతో ఆదివారం రోజున 20వేల రూపాయలు ఎస్సై వెంకన్న చెప్పిన వ్యక్తి ఫోన్ నెంబర్ కు ఫోన్ పే ద్వారా పంపించినట్లు తెలిపారు.
మిగతా 50 వేల రూపాయలు తీసుకువస్తేనే 41 నోటీస్ ఇస్తా, లేదంటే జైలుకు పంపిస్తానని ఎస్సై వెంకన్న చెప్పడంతో, లంచం ఇవ్వడం ఇష్టం లేని వాహనదారుడు నేరుగా వరంగల్ ఏసీబీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఎస్సై డ్రైవర్ సదానందం ద్వారా ఎస్సై గూగులోతు వెంకన్న 40 వేల రూపాయల లంచం తీసుకుంటున్న సమయంలో ఎస్సై వెంకన్న, డ్రైవర్ సదానందం లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

### నేడు ఏసీబీ కోర్టులో ప్రొడ్యూస్

వరంగల్ జిల్లా ఎసిబి అధికారులు పర్వతగిరి మండలం పోలీస్ స్టేషన్ లో దాడులు నిర్వహించి లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్సై గుగులోతు వెంకన్న, డ్రైవర్ సదానందం లను నేడు ఏసీబీ కోర్టులో ప్రొడ్యూస్ చేయనున్నట్లు డిఎస్పి సాంబయ్య తెలిపారు.

### ఏసీబీ అధికారుల విజ్ఞప్తి

ఎవరైనా ప్రభుత్వ కార్యాలయాల్లో విధుల నిర్వర్తిస్తూ ఏదైనా పని కోసం వారి వద్దకు వెళ్లిన ప్రజల వద్ద డబ్బులు ఆశిస్తే, అవినీతి నిరోధక శాఖ అధికారులు తక్షణమే స్పందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. సమాచారం ఇవ్వడానికి 1064 నంబర్ కి సమాచారం ఇస్తేచాలని విజ్ఞప్తి చేశారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్స్పెక్టర్లు ఎల్. రాజు, ఎస్. రాజు ఉన్నారు.

# పాడి గేదెల పెంపకంపై శిక్షణ

**- మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం**

**- ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి - ప్రాజెక్టు మేనేజర్ మునిగాల దయాకర్**

చెన్నారావుపేట, 2,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు పాడి గేదెల పెంపకంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మునిగాల దయాకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల వెటర్నరీ డాక్టర్ మంజి లాల్, మండల ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర్ సభ్యులకు శిక్షణను అందించారు. అనంతరం వీరు మాట్లాడుతూ
మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పాడి గేదెల కొనుగోలు కోసం మహిళా సంఘ సభ్యులకు బ్యాంకు ద్వారా, స్త్రీనిధి ద్వారా, సిఐఎఫ్ ద్వారా ఎటువంటి సబ్సిడీ లేకుండా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్య ఉద్దేశం పాల ఉత్పత్తిని పెంచడం, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, ఈ రెండు అంశాలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడి ప్రాంత ప్రజలు గేదెలు కాకుండా బయట నుండి మాత్రమే గేదెలు కొనుగోలు



చేసుకోవాలని లబ్ధిదారులను కోరడం జరిగింది. పాడి గేదెల పోషణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వేయించాల్సిన వ్యాక్సిన్లు, గేద కొనుగోలులో పరిశీలించాల్సిన అంశాలను, కాల్షియం ప్రోటీన్ లోపాల వల్ల వచ్చే జబ్బులు, గాలి కుంటూ, పొదుగువాపు, వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, మొదలగు అంశాలను కూలంకషంగా సభ్యులకు వివరించడం జరిగిందన్నారు. ఉపాధి హామీ ద్వారా గేదెల, గొర్రెల, కోళ్ల పెంపకం దారులకు షెడ్డు సౌకర్యం, పశుగ్రాసం పెంపకం కోసం సబ్సిడీ పథకాలు ఉన్నాయని తెలిపారు. పాడి గేదెల పెంపకం దారులు పొందిన రుణ సౌకర్యాన్ని 100 తిరిగి చెల్లించాలని, రాబోయే రోజుల్లో మరిన్ని శిక్షణలు అందించడం ద్వారా ప్రతి ఒక్క లబ్ధిదారులకు స్వతహాగా మేలు రకమైన జాతి గేదెలను పెంచుకోవడంతో పాటు ఆర్థిక అభివృద్ధితో మహిళలు మార్గదర్శకంగా మహిళా శక్తి ద్వారా విజయాలు సాధించాలని కోరారు. ఈ దిశలో భాగంగా మండలంలో మొదటి విడతగా సుమారు 80 మంది లబ్ధిదారులను గుర్తించడం జరుగిందన్నారు. ఈ అవకాశాన్ని మండల మహిళలు వినియోగించుకోవలసిందిగా ఏపిఎం ఈశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఏవో స్మిత, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు కట్టయ్య, మంజుల, సుజాత ,శ్రీలత, శ్రీనిధి మేనేజర్ ఫిర్దోష్, వివిధ గ్రామాల లబ్ధిదారులు,వీ ఓఏ లు పాల్గొన్నారు.

# పిల్లలకు తల్లిపాలు తాగించండి


## - పిల్లల భవిష్యత్తును కాపాడండి



చెన్నారావుపేట, ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ముఖ్య అతిథిగా చెన్నారావుపేట సూపర్వైజర్ రాధా హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు తాగించడం వల్ల వారు ఆరోగ్యంగానూ, వారిలో రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని అన్నారు. అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు, బాలింతలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నామని వారు అన్నారు, ప్రతి తల్లిదండ్రులు వారి పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపించాలని, దాని ద్వారా పిల్లల్లో మానసిక వికాసాన్ని పెంపొందించడం కోసం అంగన్వాడి కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లలకు, బాలింతలకు పోషకాహారం అందించడంలో ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని వారు తెలిపారు. అనంతరం పిల్లలు, బాలింతలతో కలిసి అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే ఆహార పదార్థాలు, పిల్లలకు బోధించే విధానాలు, పుస్తకాల ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బి.విజయలక్ష్మి. రజిత, కే.సరోజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, టీచర్, కలామ్స్ ఫౌండేషన్ కార్యదర్శి పరికి మధుకర్, సమ్మడి కృష్ణ, అనుమాండ్ల రాజేందర్, అంగనవాడి ఆయాలు, పిల్లలు, బాలింతలు పాల్గొన్నారు.

# నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వనజ

## - స్వాగతం తెలిపిన సిబ్బంది




**రాయపర్తి, ఆగస్టు 2, (జర్నలిస్ట్ వార్త):** ఎట్టకేలకు రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్త డాక్టర్ శుక్రవారం భాద్యతలు చేపట్టారు. ఒక విధంగా చెప్పాలంటే ఏరియా డాక్టర్లకు కష్టం తప్పిందనే చెప్పాలి, దాదాపుగా గతంలో మెడికల్ అధికారిగా వెంకటేష్ విధులు నిర్వర్తించేవారు. వారు అక్కడి నుంచి బదిలీ అయ్యి దాదాపుగా సంవత్సర కాలం దాటిందని చెప్పాలి. అప్పటినుంచి ఇప్పటివరకు రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నటువంటి 21 సబ్ సెంటర్లలో విధులు నర్వర్తించే డాక్టర్లే రోజుకు ఒకరి చొప్పున ఆ బాధ్యతలు చేపట్టి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కొనసాగించారు. లాంగ్ టైం తర్వాత ఇప్పటికీ గాని పర్మినెంట్ కొత్త డాక్టర్ వీధులకు హాజరయ్యారు. వెళితే నూతనంగా భాద్యతలు చేపట్టిన డాక్టర్ వనజ వరంగల్ సికేఎం ఆసుపత్రి నుండి బదిలీపై రాయపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెడికల్ అధికారిగా హాజరైనారు. ఈ సందర్భంగా వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాయపర్తి సిబ్బంది సుస్వాగతం తెలిపారు.

# ఇళ్లలోకి చొరబడి మనుషులను చంపడమా!

## మహిళను వీధి కుక్కలు తినడంపై తీవ్రంగా స్పందించిన హైకోర్టు

**పరిష్కార మార్గం కనుగొనకుంటే ఎలా అని సర్కార్‌ను నిలదీత**
**స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కాదు.. నియంత్రణకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలి**
**జీహెచ్ఎంసీకి పలు మార్గదర్శకాలు జారీ చేస్తూ ఉత్తర్వులు**

హైదరాబాద్,ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త):
వీధి కుక్కలు ఇంట్లోకి వెళ్లి మహిళను చంపి.. అవయవాలు తినడం అత్యంత దారుణమైన ఘటన అని హైకోర్టు పేర్కొంది. ఇలా మహిళలు, చిన్నారులను కుక్కలు చంపుతున్నా పరిష్కార మార్గం కనుగొనకుంటే ఎలా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. 'స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కాదు.. దాడుల నియంత్రణకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలి'అని ఆదేశించింది. ప్రజాప్రయోజన వ్యాజ్యంలో వాదనలు కాదని, పరిష్కారం కావాలని న్యాయవాదులకు సూచించింది.
ఆ దిశగా అందరి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని సర్కారుకు స్పష్టం చేసింది. వీధి కుక్కలకు పునరావాస కేంద్రాలు, ప్రజల కోసం హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలని చెప్పింది. జూన్ 28న పటాన్‌చెరు ఇస్నాపూర్‌లో వీధి కుక్కల దాడిలో 8 ఏళ్ల బాలుడు విశాల్ మృతి చెందాడు. ఈ దారుణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. గతంలో ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న పిటిషన్లకు దీనిని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది.
ఈ పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వృద్ధురాలిని కుక్కలు పీక్కుతిన్న వైనం, చిన్నారులపై కుక్కల దాడిపై పత్రికల్లో వచ్చిన కథనాలు కోర్టులో ప్రస్తావనకు వచ్చాయి.

### పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు చేశాం..

రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ ఎ.సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. యానిమల్ బర్త్ కంట్రోల్, యాంటీ రేబీస్ ప్రోగ్రామ్‌ను సమర్థవంతంగా అమలు చేయడం కోసం కమిటీ ఏర్పాటు చేశామని, ఈ కమిటీ పలు నిర్ణయాలు తీసుకుందని వివరించారు. యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్ పనిచేస్తోందన్నారు. జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా నిర్వహిస్తోందన్నారు. కాగా, గత విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశాల అమలుపై జీహెచ్ఎంసీ నివేదిక అందజేసింది.
పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వాటి యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించింది. కాగా, వీధి కుక్కలను షెల్టర్లకు తరలించి వాటికి అక్కడే అన్ని సదుపాయాలు కల్పించాలని న్యాయవాది వేణుమాధవ్ కోరారు. జీహెచ్ఎంసీ నివేదికను పరిశీలించిన సీజే పలు సూచనలు చేశారు. జంతు సంక్షేమ బోర్డు తరపున న్యాయవాదిగా డీఎస్‌జీ గాడి ప్రవీణ్‌కుమార్‌ను చేర్చాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

### ధర్మాసనం సూచనలు..

- వీధి కుక్కలపై ఫిర్యాదులకు నగరవాసుల కోసం ప్రత్యేకంగా ఓ హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ, రాష్ట్రంలోని వివిధ జంతు సంక్షేమ సంస్థలను సంప్రదించి దాడుల నియంత్రణకు సూచనలు స్వీకరించాలి.
- ఏబీసీ నిబంధనల ప్రకారం జీహెచ్ఎంసీ, స్థానిక సంస్థలు తగినన్ని షెల్టర్లు, పశు వైద్యశాలలు, కుక్కల తరలింపు వ్యాన్‌లు, మొబైల్ వ్యాన్లు, సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఏబీసీ కేంద్రాలు నెలకొల్పి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- ఏబీసీ కేంద్రాల్లో కుక్కలకు వ్యాక్సినేషన్ చేయించాలి. వ్యాక్సినేషన్ నిర్వహించేందుకు జంతు సంక్షేమ సంస్థలు ముందుకొస్తే ఆ ఖర్చులు ప్రభుత్వం భరించాలి.

# కలెక్టర్ ను కలసిన సెంట్రల్ ట్రైనీ అసిస్టెంట్ స్టాటిస్టికల్, సెక్షన్ ఆఫీసర్లు



వరంగల్, ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త): జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవిని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హైదరాబాదులో శిక్షణ పొందుతున్న అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టరేట్ ని కలిశారు.
మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ జూబ్లీహిల్స్ హైదరాబాదులో శిక్షణ పొందుతున్న 20 మంది సెంట్రల్ సెక్రటేరియట్ అసిస్టెంట్ స్టాటిస్టికల్ సెక్షన్ ఆఫీసర్లు జూలై 29 నుండి ఆగస్టు 2 వరకు జిల్లాలోని గీసుకొండ మండలం గంగాదేవి పల్లి, మరియాపురం గ్రామాలు, వర్ధన్నపేట మండలం, ఇల్లంద, సంగెం మండలం తీగరాజు పల్లి గ్రామాలను సందర్శించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వాటి అమలు తీరును అవగతం చేసుకున్నారు. సందర్శన ముగింపు సందర్భంగా వారు కలెక్టర్ ను కలసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు, గ్రామాల అభివృద్ధికి ఏవిధంగా దోహద పడతాయనే విషయాలను వివరించారు. అందించిన సూచనలు, సలహాలు భవిష్యత్తులో ప్రణాళికలు రూపొందించుటకు ఉపయోగ పడతాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డిఆర్డిఓ కౌశల్య దేవి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, ఇటిసి ప్రిన్సిపాల్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో తిరగనియ్యం కొడకల్లారా.. తోలు తీస్తా

**బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఘాటు వ్యాఖ్యలు**
**దానం మాటలతో ఆందోళనకు దిగిన బిఆర్ఎస్ నాయకులు**
**వ్యాఖ్యలను ఉపసంహరించుకున్న ఎమ్మెల్యే నాగేందర్**



హైదరాబాద్ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త):
కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో హైదరాబాద్ నగర పరిస్థితిపై మాట్లాడుతుండగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు గోల చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన దానం నాగేందర్ 'మీరు ఇలాగే ప్రవర్తిస్తే హైదరాబాద్‌లో తిరగనియ్యం కొడకల్లారా.. తోలు తీస్తా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాటకాలు ఆడుతుతున్నారా? అంటూ ఆవేశంగా మాట్లాడారు. దానం వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభలో ఆందోళన చేశారు. ఇది మంచి సంప్రదాయం కాదని తక్షణమే దానం నాగేందర్ క్షమాపణ చెప్పాలని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తనను కవ్వించారని, అయినా తన పరిధిలోనే మాట్లాడానని, తాను మాట్లాడిన మాటలు సభలోని సభ్యులకు బాధ కలిగించి ఉంటే విచారం వ్యక్తం చేస్తున్నానని ఆయన సభ ముందు తెలిపారు. %ఆ పదాలు సర్వసాధారణంగా వస్తుంటాయని, గతంలో తాను ఎప్పుడు నోరు జారలేదని, సబ్జెక్ట్ మీద మాట్లాడుతుంటే వాళ్లే తనను దూషించారన్నారు. అయినా తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ అడుగుతున్నానని దానం నాగేందర్ అక్బరుద్దీన్ డిమాండ్‌కు స్పందించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దానం వ్యాఖ్యలను పరిశీలించి అవసరమైతే రికార్డుల నుంచి తొలగిస్తామన్నారు.
హైదరాబాద్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై శాసనసభలో శుక్రవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ చర్చను ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రారంభించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలతో శాసనసభలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఎమ్మెల్యే దానం ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభ స్పీకర్ పోడియం ఎదుట బిఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు.

# ఎదురులేని మను బాకర్.. హ్యాట్రిక్ పతకానికి అడుగు దూరంలో..



పారిస్:హైదరాబాద్,ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త):
ఒలింపిక్స్‌లో భారత సంచలన షూటర్ మను బాకర్ మరో పతకానికి అడుగు దూరంలో నిలిచింది. ఈ ఒలింపిక్స్‌లో ఇప్పటికే రెండు పతకాలు గెలిచి మను బాకర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగే ఫైనల్ పోరు పతకం సాధిస్తే ఒలింపిక్స్‌లో మను నయా చరిత్ర సృష్టిస్తోంది. ఇక శుక్రవారం జరిగిన 25 మీటర్ల క్వాలిఫికేషన్ పోటీల్లో మను అద్భుత ఆటను కనబరిచింది. ఆరంభం నుంచే పూర్తి ఏకాగ్రతతో ముందుకు సాగింది.తొలుత జరిగిన ప్రిసిషన్ రౌండ్‌లో 294 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత ర్యాపిడ్ రౌండ్‌లోనూ సత్తా చాటింది. ఈ రౌండ్‌లో ఏకంగా 100 పాయింట్లను సొంతం చేసుకుంది. క్వాలిఫికేసన్‌లో ఓవరాల్‌గా 590 పాయింట్లు సాధించిన మను బాకర్ రెండో స్థానంలో నిలిచింది. శనివారం జరిగే ఫైనల్లోనూ సత్తా చాటి తన ఖాతాలో మూడో పతకం జత చేసుకోవాలనే లక్షంతో కనిపిస్తోంది.కాగా, మను ఇప్పటికే మహిళల 10 మీటర్ల వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్య పతకాలు గెలిచిన విషయం తెలిసిందే. తాజాగా 25 మీటర్ల విభాగంలోనూ ఫైనల్‌కు చేరడంతో మరో పతకం సాధించే అవకాశాలు మెరుగయ్యాయి. తుది పోరులో మెరుగ్గా రాణిస్తే మను ఖాతాలో హ్యాట్రిక్ పతకాలు చేరుతాయి. ఇదే జరిగితే భారత ఒలింపిక్స్ చరిత్రలోనే సరికొత్త ఆధ్యాయం ఆవిష్కృమతమవుతుంది. ఒకే ఒలింపిక్స్‌లో హ్యాట్రిక్ పతకాలు గెలిచిన తొలి భారత అథ్లెట్‌గా మను బాకర్ నయా చరిత్ర లిఖిస్తోంది.

### ఇషా ఆశలు గల్లంతు..

మరోవైపు తెలంగాణకు చెందిన యువ షూటర్ ఇషా సింగ్ క్వాలిఫికేషన్‌లో నిరాశ పరిచింది. ఈ ఒలింపిక్స్‌లో మెరుగైన ప్రదర్శనతో పతకం సాధిస్తుందని భావించిన ఇషా అర్హత పోటీల్లో 18వ స్థానానికి పరిమితమైంది. ఆశించిన స్థాయిలో రాణించడంలో విఫలమైన ఇషా 581 పాయింట్లు మాత్రమే సాధించింది. పారిస్ ఒలింపిక్స్‌లో అభిమానులు ఇషాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. కొంతకాలంగా ప్రపంచ షూటింగ్‌లో ఇషా అసాధారణ ఆటతో అలరిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఒలింపిక్స్‌లోనూ పతకం సాధిస్తుందని అందరూ భావించారు. కానీ ఇషా మాత్రం పేలవమైన ప్రదర్శనతో అభిమానులను నిరాశకు గురి చేసింది. ఇంతకుముందు తెలంగాణ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిదారి పట్టిన సంగతి తెలిసిందే.

# హైదరాబాద్‌కు మరో అంతర్జాతీయ స్టేడియం తీసుకొస్తాం


## : రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త):
క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిఖత్ జరీన్‌కు ఆర్థిక సాయం చేయడంతో ఇంటి స్థలం కేటాయిస్తామని, టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు విద్యార్హత లేకున్నా గ్రూప్-1 ఉద్యోగం ఇస్తున్నామని స్పష్టం చేశారు. శాసన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో త్వరలో క్రీడా విధానం తీసుకొస్తామని, హర్యానా క్రీడా విధానం పరిశీలిస్తున్నామని, త్వరంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తామని, స్పోర్ట్ పాలసీపై ఎవరు సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామని స్పష్టం చేశారు.హైదరాబాద్‌లో మరో క్రికెట్ మైదానం వస్తుందని, యూసుఫ్‌గూడ, గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియాల్లో క్రీడలు తగ్గాయని, ఎల్‌బి స్టేడియంలో క్రీడలు తగ్గడంతో పాటు రాజకీయ కార్యకలాపాలు పెరిగాయన్నారు. హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ స్టేడియం తీసుకొస్తామని, స్కిల్ యూనివర్సిటీ సమీపంలో అంతర్జాతీయ స్టేడియం నిర్మిస్తామని, బ్యాగరికంచెలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బిసిసిఐతో చర్చలు జరిపామని రేవంత్ రెడ్డి తెలియజేశారు. క్రీడల కోసం బడ్జెట్‌లో రూ.321 కోట్లు కేటాయించామని, హర్యానా తరహాలో క్రీడాకారులను పోత్సహిస్తామన్నారు. భూముల లభ్యత చూసి మండల కేంద్రాల్లో స్టేడియాలు నిర్మిస్తామని, తెలుగువర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

# కాంగ్రెస్‌లోనే ఎమ్మెల్యే బండ్ల..

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కృష్ణమోహన్‌రెడ్డి



హైదరాబాద్,ఆగస్టు 2,(జర్నలిస్ట్ వార్త):
గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మళ్లీ కాంగ్రెస్ చెంతకు చేరారు.శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి.. తాను కాంగ్రెసలోనే కొనసాగుతానని చెప్పారు. ఓవైపు శాసనసభ సమావేశాలు జరుగుతుండగా.. కృష్ణమోహన్‌రెడ్డి బుధవారం బీఆర్ఎసఎల్పీ కార్యాలయానికి వెళ్లడంతో ఆయన తిరిగి సొంత గూటికి చేరుకున్నారనే ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే.దీంతో మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికెళ్లి మాట్లాడటంతోపాటు ఆయనను తన వెంటే హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. శుక్రవారం మంత్రి జూపల్లి ఆధ్వర్యంలోనే కృష్ణమోహనరెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.




# దర్శకధీరుడు రాజమౌళిపై డాక్యుమెంటరీ

దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళిపై ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ రూపొందించిన డాక్యుమెంటరీ విడుదలైంది. 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో తీసుకొచ్చిన ఈ డాక్యుమెంటరీ తెలుగు, తమిళ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇందుకు సంబంధించిన ప్రోమోను నెట్‌ఫ్లిక్స్ పంచుకుంది. అందులో టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్‌లతో పాటు హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్, బాలీవుడ్ ప్రముఖుడు కరణ్ జోహర్‌లు కూడా వారి అభిప్రాయాన్ని తెలియజేశారు.

# 'దేవర' అప్డేట్ : జాన్వీతో ఎన్టీఆర్ రొమాంటిక్ లవ్ ధమాకా!

యంగ్ టైగర్ ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్న సినిమా 'దేవర'. మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్, డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషనల్ లో రెండు భాగాలుగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ ఇది. ఇందులో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఫస్ట్ పార్ట్ ని వచ్చే నెలాఖరున ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అయితే విడుదలకు యాభై రోజుల సమయం మాత్రమే ఉన్నా, ఇంకా ప్రమోషన్స్ స్పీడ్ పెంచకపోవడంతో ఫ్యాన్స్ కాస్త నిరాశ చెందారు. ఈ నేపథ్యంలో వారిని ఉత్సాహ పరిచే ఓ క్రేజీ అప్డేట్ వచ్చేసింది. 'దేవర 1' సినిమా నుంచి ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ మెటీరియల్ కు అనూహ్య రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సాంగ్ లిరికల్ వీడియో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ క్రమంలో సెకండ్ సింగిల్ ను రిలీజ్ చెయ్యడానికి మేకర్స్ రెడీ అయిపోయారు. ఆగస్టు 5వ తేదీన రెండో పాటను విడుదల చేయబోతున్నట్లు తాజాగా అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, జాన్వీ కపూర్ లకు సంబంధించిన ఓ బ్యూటిఫుల్ పోస్టర్ ను సోషల్ మీడియాలో షేర్ చేసారు. సిజ్లింగ్ జోడీకా లవ్ ధమాకా రాబోతోందని పేర్కొన్నారు. 'దేవర' నుంచి ఈసారి ఓ రొమాంటిక్ మెలోడీ సాంగ్ వస్తోందని పోస్టర్ ని బట్టి అర్థమవుతోంది. ఫారెస్ట్ బ్యాగ్రౌండ్ లో తారక్, జాన్వీలు ఒకరినొకరు చూసుకుంటూ రొమాంటిక్ ఫోజ్ ఇచ్చారు. వైట్ అండ్ వైట్ లో అతిలోక సుందరి కూతురు చాలా అందంగా కనిపించింది.. దేవకన్యలా మెరిసిపోతోంది. సైడ్ యాంగిల్ లో తన తల్లి శ్రీదేవిని గుర్తు చేస్తోంది. ఎన్టీఆర్ న్యూ లుక్ లో ఆకట్టుకున్నారు. హీరో హీరోయిన్ల కలయికలో వచ్చిన ఫస్ట్ పోస్టర్ కావడంతో క్షణాల్లోనే వైరల్ అయిపోయింది. వర, తంగంల కెమిస్ట్రీ అదిరిపోయిందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.'తంగం అంతరంగం.. హోయిగా.. ఉయ్యాలూగుతున్నట్టుంది' అనే లిరిక్స్ రాసినట్లు గీత రచయిత రామజోగయ్య శాస్త్రి ఇటీవల ఎక్స్ లో పేర్కొన్నారు. అది 'దేవర'లోని రెండో పాటే అయ్యుంటుందని అర్థమవుతోంది. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సాంగ్ కు మ్యూజిక్ కంపోజ్ చేసారు. ఆర్.రత్నవేలు సినిమాటోగ్రఫీ నిర్వహించగా.. సాబు సిరిల్ ప్రొడక్షన్ డిజైనర్ గా వర్క్ చేస్తున్నారు. ఏ. శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. కోస్టల్ బ్యాక్ డ్రాప్ లో ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా 'దేవర' సినిమాలో ఎన్టీఆర్ డ్యూయెల్ రోల్ లో కనిపించనున్నారు. సైఫ్ అలీఖాన్ విలన్ గా నటిస్తుండగా.. శృతి మరాఠే, రమ్యకృష్ణ, చైత్ర రాయ్, షైన్ టామ్ చాకో, శ్రీకాంత్, ప్రకాష్ రాజ్, కలైయరసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్ పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'దేవర' పార్ట్-1 2024 సెప్టెంబర్ 27న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో భారీ ఎత్తున విడుదల కానుంది.











# విజయ్ దేవరకొండ చిత్రం వచ్చే ఏడాదికి విడుదల

విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్న చిత్రం 'వీడీ 12' నుంచి పోస్టర్ వచ్చి నెలలు గడిచిపోవడంతో అప్‌డేట్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా దీనికి సంబంధించిన అప్‌డేట్‌ను చిత్రబృందం పంచుకుంది. మూవీ విడుదల తేదీని ప్రకటిస్తూ నిర్మాత ఓ పోస్టర్ షేర్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఏడాది మార్చి 28న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నట్లు తెలిపారు. 7 ఏళ్లుగా గౌతమ్ తిన్ననూరితో కలిసి వర్క్ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనపై నమ్మకంతో చెబుతున్నాను.. ఈసారి మళ్లీ రౌడీ హీరో విజయ్ దేవరకొండను పవర్‌ఫుల్ పాత్రలో చూడబోతున్నారు. ఆగస్టులోనే దీని టైటిల్‌ను ప్రకటిస్తాం అని పేర్కొన్నారు. 'విధి పిలిచింది.. రక్తపాతం ఎదురుచూస్తోంది.. కొత్త రాజు ఉద్భవిస్తాడు' అనే క్యాప్షన్‌ను పంచుకున్నారు. పస్తుతం దీని షూటింగ్ శ్రీలంకలో శరవేగంగా జరుగుతోంది. ఇటీవల ఈ చిత్రీకరణకు సంబంధించిన కొన్ని ఫొటోలు లీక్ కాగా.. నిర్మాణసంస్థ స్పందించింది. డియర్ రౌడీ ఫ్యాన్స్.. మీకు మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించేందుకు టీమ్ ఎంతో కష్టపడుతోంది. 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. లీక్ అయిన ఫొటోను షేర్ చేయొద్దని విజ్ఞప్తి చేసింది. ఇందులో విజయ్‌దేవరకొండ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రానున్న ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు.



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ శుక్రవారం ఉలఝ్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, కథల ఎంపికపై ఆసక్తికర వ్యాఖ్యాలు చేశారు. 'కెరీర్‌ను మార్చే అవకాశమైనా.. జుట్టు లేకుండా కనిపించే పాత్రను అంగీకరించను అన్నారు. 'ఎలాంటి పాత్రలో నటించకూడదని నిర్ణయించుకున్నారు?' అని యాంకర్ అడగ్గా జాన్వీ స్పందించారు. హెయిర్ లేకుండా నటించాల్సి వస్తే నేనెప్పుడూ సున్నితంగా తిరస్కరిస్తా. ఎంత కష్టమైన పాత్రైనా చేస్తాను కానీ జుట్టు లేకుండా కనిపించేందుకు ఇష్టపడను. 'ఉలఝ్'లోని పాత్ర కోసం దర్శకుడు నా హెయిర్‌ను కొంత కట్ చేయాలని సూచించారు. అందుకు నేను ఆయనతో గొడవపడ్డా నా తొలి సినిమా 'ధడక్' కోసం జుట్టు కత్తిరించుకున్నా. 'ఎందుకిలా చేశావ్?' అంటూ మా అమ్మ అరిచింది. ఏ రోల్ కోసమైనా హెయిర్ కట్ చేసుకోవద్దని చెప్పింది. నా జుట్టంటే ఆమెకు అంత ఇష్టం. మూడ్రోజులకోసారి ఆయిల్ రాసి మసాజ్ చేస్తది. అమ్మ కారణంగానే హెయిర్ కట్ చేసుకోను' అని అంది జాన్వీకపూర్. గుల్షన్ , జాన్వీకపూర్, రోషన్ మాథ్యు కలిసి నటించిన చిత్రమిది. దేశభక్తి కథాంశంతో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్‌గా రూపొందింది. జాతీయ అవార్డు గ్రహీత సుధాన్షు సరియా దర్శకత్వం వహించారు. ప్రస్తుతం ఆమె తెలుగులో దేవర చిత్రంలో నటిస్తోంది. రెండు పార్టులుగా ఈ చిత్రం తెరకెక్కనుంది. తదుపరి రామ్‌చరణ్, సానా బుచ్చిబాబు కాంబోలో తెరకెక్కే చిత్రంలో ఆమె అవకాశం అందుకుంది.

# ఓటిటిలోకి ప్రియదర్శి డార్లింగ్




ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటించిన యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ 'డార్లింగ్'. జూలై 19న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనను తెచ్చుకుంది. ఇప్పుడు ఈ మూవీ డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. కథ విషయానికి వస్తే.. ఒక ట్రావెల్ ఏజెన్సీలో పని చేసే రాఘవకు పెళ్లి చేసుకొని హనీమూన్‌కు పారిస్ వెళ్లాలని కలలు కంటూ ఉంటాడు. ఈక్రమంలో ఒకటి రెండు సంబంధాలు పెళ్లి వరకు వచ్చి డిప్రెషన్‌లోకి వెళతాడు. అలాంటి సమయంలో ఆనంది (నభ నటేష్) పరిచయం అవడం, వివాహం చేసుకోవడం జరిగి పోతాయి. తీరా అసలువిషయం అప్పుడే మొదలవుతుంది. ఆనందికి మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్ అనే వ్యాధి ఉన్నట్లు తెలుస్తుంది. దీంతో ఆమె ఏ నిమిషం ఎలా ఉంటుంది, ఎలా ప్రవర్తిస్తుందనే విషయం అసలు అంతుచిక్కదు. ఈ నేపథ్యంలో రాఘవ ఆనందితో ఎలా కాపురం చేశాడు, హనీమూన్ కల తీరిందా లేక ఇద్దరూ విడిపోయారా? అసలు ఆనంది ఎవరు, ఆమె నేపథ్యం ఏంటి? ఆమె గతం గురించి తెలిసిన రాఘవ చివరికి ఏమి చేశాడు? అనే ఆసక్తికరమైన కథకథనాల చుట్టూ సినిమా సాగుతూ నవ్వులు పూయిస్తుంది. ఇప్పుడు ఈ చిత్రాన్ని నెల రోజులలోనే ఈ నెల 13వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ఓటీటీలో స్ట్రీమింగ్‌కు తీసుకు వస్తున్నారు. సో ఎవరైతే థియేటర్లలో మిస్సయ్యారో ఇక ఇంట్లోనే కుటుంబంతో కలిసి చూసి ఆనందించండి.